క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవ పూజలు ప్రారంభం



కలశాలతో అభిషేకానికి క్యూలైన్లలో ఉన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన శ్రీజగజ్జననీ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఉదయాన్నే గణపతిపూజ, పుణ్యాహవాచనం, శాల ప్రవేశం, మండప పూజాధికం, కలశ స్థాపన అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకాలు చేసి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రదోష పూజ, అగ్నిప్రతిష్టాపన హోమం చేపట్టారు.

కరాటే విజేతలకు బహుమతుల పంపిణీ



క్రీడాకారులకు పతకాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు జిల్లా జీత్ కునేడో కరాటే సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే ముగింపు సందర్భంగా సోమవారం లయన్స్ జిల్లా గవర్నర్ రామచంద్రప్రకాష్, డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ కరాటే వల్ల బాలబాలికల్లో శారీరక దారుఢ్యం, ఆత్మస్థైర్యం ఇనుమడింపజేస్తాయని, అలాగే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతాయని చెప్పారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని వారు కోరారు. కటాస్, కుమితే విభాగాల్లో వివిధ వయస్సు కేటగిరిల్లో పోటీలు నిర్వహించిన విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. సంఘం కార్యదర్శి బాలకృష్ణ, రంగస్వామి, రాంబాబు, పవన్ పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించండి



రుద్రవరం కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న జీసీడీఓ నాగ సువర్చల

రుద్రవరం: శ్రద్ధతో చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జీసీడీఓ నాగసువర్చల విద్యార్థినులకు సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. విద్యార్థినుల వివరాలు,హాజరు, భోజనం, వసతుల గురించి ఎస్ఓ లక్ష్మీదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పలు తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. వచ్చేది పరీక్షల కాలమని, మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని చెప్పారు.

లయన్స్ సేవలు విస్తృతం చేయాలి



స్వర్గధామం అభివృద్ధికి విరాళం అందజేసిన సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్ గవర్నర్ రామచంద్రప్రకాష్ అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలతో పాటు ఆరోగ్య విద్య, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. క్లబ్ కార్యదర్శి కూరప్రసాద్ తన తండ్రి జ్ఞాపకార్థం పట్టణంలోని స్వర్గధామం అభివృద్ధికి రూ.30వేలు అందజేశారు. అనంతరం అంతర్జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ దస్తగిరి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ హాజరయ్యారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, సత్యనారాయణ, చంద్రమోహన్, సహదేవుడు, శ్రీకాంత్, భవనాశి వాసు, మహేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ స్పందనకు రెండు వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్ వరప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు రెండు వినతులు వచ్చాయని ఆయన తెలిపారు. పట్టణంలోని 43 వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ 3 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్న రోజువారీ స్పందనలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున వినతులు తగ్గాయని చెప్పారు.

వ్యసనమా.. వదులుమా

సినిమాలు, పరిచయాల ప్రభావం, సావాస దోషం, ఒత్తిడిని తట్టుకోలేక, చిన్నపాటి అలవాట్లతో మొదలై యువత అధికంగా వ్యసనాల బారిన పడుతోంది. చాలా మంది వాటి నుంచి బయటపడలేక తీవ్ర మనోవేదనకు గురై మరిన్ని వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న చిరునవ్వు' పేరుతో డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వీటిల్లో అలవాట్లను మాన్పించేందుకు డాక్టర్లు వైద్యసేవలందిస్తున్నారు. వ్యసనాల నుంచి విముక్తి పొందడానికి వచ్చే వారిలో 55 శాతానికి పైగా 30 ఏళ్ల లోపు వారే ఉండటం విశేషం.

- నంద్యాలలో డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్
- మద్యం, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలను మాన్పించేందుకు వైద్య సేవలు
- రోజూ 20 నుంచి 30 మంది బాధితులు ఆసుపత్రికి
- ఇందులో 55 శాతం మంది 30 ఏళ్ల లోపు వారే
- నికోటిన్ స్కాచ్ స్టిక్కర్ అతికిస్తే చాలు.. సిగరెట్ తాగాలన్పించే ఆలోచనకు స్వస్తి

నంద్యాల మండలం మిట్నాల గ్రామానికి చెందిన 30 ఏళ్ల వయస్సున్న తన కుమారుడు మద్యానికి బానిస కావడంతో నంద్యాల డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. వారం రోజుల చికిత్స తర్వాత ఇంటికి తీసుకెళ్లారు. క్రమంగా అతను వ్యసనం నుంచి బయట పడుతున్నాడని బాధితుడి తల్లి చెబుతోంది.

రుద్రవరం మండలానికి చెందిన 50 సంవత్సరాల వ్యక్తి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మూడు నెలల క్రితం నంద్యాలలోని డీ అడిక్షన్ సెంటర్‌కు తీసుకొచ్చారు. వైద్యులు చికిత్స చేశారు. ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉందని, మద్యం తాగడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నంద్యాల: వ్యసనం.. ఎంతటి వారినైనా ఆరోగ్యంగా, ఆర్థికంగా చిత్తు చేస్తుంది. ఇంట్లో, సమాజంలో విలువ కోల్పోయి..మనోవేదనకు గురై మరిన్ని వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా యువత దీని బారిన అధికంగా పడుతున్నారు. మద్యం, సిగరెట్, మత్తు పదార్థాలతో కన్న వారిని క్షోభకు గురిచేయడమే కాకుండా తమ భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకుంటున్నారు. అలవాట్ల కారణంగా ఆరోగ్యం క్షీణించి అర్థాంతరంగా తనువు చాలించిన వారు ఎందరో ఉన్నారు. మరికొందరు తమ జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వ్యసనపరులను సాధారణ వ్యక్తులుగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల చర్యలు నామమాత్రమే. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే చర్యలకు నడుం బిగించింది. జగనన్న చిరునవ్వు పేరుతో ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్యసేవల ద్వారా వ్యసనాలను దూరం చేసే ప్రక్రియకు పూనుకుంది. ఇందులో భాగంగా విముక్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా అరికట్టేందుకు నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రాన్ని (డీ అడిక్షన్ సెంటర్) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఆసుపత్రికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోజుకు 20 నుంచి 30 మంది వచ్చి సేవలు పొందుతున్నారు. ఇక్కడ మద్యం, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి అలవాట్లు మాన్పించేందుకు వైద్యసేవలు అందిస్తున్నారు.



వ్యసన పరులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్యులు

55 శాతం మంది 30 ఏళ్ల లోపు వారే..

నంద్యాల వ్యసన విముక్తి కేంద్రానికి వచ్చే బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటి వరకు చికిత్స పొందిన కేసుల్లో 50 శాతం మంది 30 ఏళ్ల లోపు వారే. వీరిలో ఎక్కువ మంది డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఇలా ఉన్నత చదువులు చదివిన వారే అధికంగా ఉండటం గమనార్హం.

నికోటిన్ స్కాచ్ స్టిక్కర్‌తో స్మోకింగ్‌కు చెక్



కొంత మంది రోజూ పెట్టెలకు పెట్టెలు సిగరెట్లు కాల్చుతుంటారు. సిగరెట్లు కాల్చాలన్న ఆలోచన రాకుండా ఉండేందుకు ఇక్కడ మందులు ఇస్తారు. కౌన్సెలింగ్‌తో పాటు సిగరెట్ ప్యాకెట్‌లాగా ఉన్న ఓ బాక్స్ ఇస్తారు. ఇందులో సిగరెట్ల మాదిరిగానే పది స్టిక్కర్లు ఉంటాయి. సిగరెట్ కాల్చుదామని అనిపించినప్పుడల్లా ఈ స్టిక్కర్ చెస్ట్ లేదా చేతి పై భాగంలో అతికించుకుంటే చాలు ఆ ఆలోచనే రాదని వైద్యులు చెబుతున్నారు.

ఎవరైనా సంప్రదించవచ్చు



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రంలో ఎవరైనా బాధితులు చికిత్స తీసుకోవచ్చు. ఆసుపత్రికి వచ్చిన వారికి చికిత్స కాకుండా ముందుగా నికోటిన్స్ ఇవ్వడం ద్వారా వ్యసనాలకు దూరం చేసేందుకు ప్రయత్నిస్తాం. అప్పటికీ మార్పు రాకపోతే ఇతర సేవలు అందిస్తాం. మద్యం అలవాటు మానాలంటే కుటుంబ సభ్యులు, స్నేహితుల సమష్టి కృషి అవసరం. మద్యం మాన్పించేందుకు వైద్యులు అందించే మందులు నాడి వ్యవస్థపై పనిచేస్తాయి. అవి వాడితే మద్యం తాగాలన్న కోరిక ఉండదు. మందులతో పాటు పర్యవేక్షణ అవసరం. కొంత మార్పు వచ్చే వరకు సంబంధిత వ్యక్తిని ఇంటి నుంచి బయటకు పంపకూడదు. మద్యం అలవాటు ఉన్న స్నేహితులను ఇంటికి రానివ్వకూడదు. మద్యం దుకాణాల వైపు వెళ్లనివ్వకూడదు. మద్యం తాగలేదన్న లోటును తెలియనివ్వకుండా కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలి. ఈ సూచనలు పాటిస్తే ఏడాదికంతా మద్యం అలవాటు నుంచి దూరం చేయవచ్చు.

– డాక్టర్ రూప్స్, వ్యసన విముక్తి కేంద్రం అధికారి, నంద్యాల

ఫిజియోథెరపీతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం: ఫిజియోథెరపీ వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్య నిపుణులు రమేష్, మహేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వారు ఏపీఎం, సీసీలు, వీఓలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఏవైనా నొప్పులు వచ్చినప్పుడు వెంటనే వాటికి సంబంధంచి మాత్రలు మింగడం సహజమని, అలా ప్రతిసారీ పెయిన్ కిల్లర్లు వాడటం వల్ల ఆరోగ్యం మరింత దెబ్బతింటుందని చెప్పారు. మాత్రలకు బదులుగా నొప్పులు వచ్చినప్పుడు ఫిజియో థెరపీ చేయించుకోవడం వల్ల నొప్పులు దూరమవడంతో పాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వివరించారు.



వెలుగు సిబ్బందికి సూచనలు ఇస్తున్న నిపుణులు

కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: ఆర్‌బీకేల ద్వారా జొన్నల కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి సూచించారు. మండలంలోని ఎం.కృష్ణాపురం, యాళ్లూరు, గోస్పాడు గ్రామాల్లోని ఆర్‌బీకేలను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో జొన్నలను కొనుగోలు చేస్తుందన్నారు. క్వింటాకు రూ.2,970 ప్రకారం కొనుగోలు చేస్తుందన్నారు. జొన్నలు విక్రయించిన రెండు రోజుల్లోపే ఆధార్ కార్డుకు లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లో రైతులకు నగదు జమ చేస్తారని చెప్పారు. అలాగే ఆయా గ్రామాల్లో ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదును పరిశీలించారు. వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్, సిబ్బంది పాల్గొన్నారు.



జొన్నలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

ఉయ్యాలవాడ : సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర మానిటరింగ్ పరిశీలకులు కోనయ్య, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత చేపట్టనున్న సోషల్ ఆడిట్ పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలంలో చేపట్టిన పనులు, గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా నాడు నేడు, సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, తదితర అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణాలు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నాయా లేదా ఏదైనా ఇబ్బందులు ఎదురవుతున్నా యా, తదితర అంశాలపై విచారణ చేసి రాత పూర్వకంగా నివేదిక సమర్పించాలని డీఆర్పీలు, కమిటీ బృందాలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సార్పీ లోకేష్, ఏపీఏ రవిప్రకాష్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్‌కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎస్‌పీఎం

తూతూ మంత్రంగా లెగసీ వేస్ట్ శుద్ధి

నంద్యాల(సిటీ): పట్టణంలో లెగసీవేస్ట్ పరిశుభ్రం తూతూ మంత్రంగా సాగుతోంది. సోమవారం డంప్ యార్డులో మంటలకు ఘన వ్యర్థాలు తగలబడ్డాయి, మంటలను అగ్నిమాపక శాఖ అధికారులు అదుపు చేశారు. పీవీ నగర్ ప్రాంతంలో ఉన్న డంప్ యార్డులో లెగసీ వేస్ట్‌ను శుభ్రపరిచేందుకు మున్సిపల్ నిధుల నుంచి ఏకంగా రూ.5.25 కోట్లు వెచ్చించి యంత్రాలు ఏర్పాటు చేశారు. యంత్రాలు మొరాయిస్తున్నట్లు సాక్షి దినపత్రికలో డిసెంబర్ 19న ప్రచురిస్తే అధికారులు కొత్త యంత్రాన్ని డిసెంబర్ 31న తీసుకొచ్చారు. ఆ యంత్రాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి జనవరి 13న ప్రారంభించారు. ఈ సమయంలో ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ఘన వ్యర్థాలను శుద్ధిచేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఘనవ్యర్థాలు మొత్తం కాలిపోతున్నాయి. నవంబర్‌లో మొదలు పెట్టిన ఈ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఇలా కోట్ల రూపాయలు వెచ్చించినా శుద్ధీకరణలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



తగలబడుతున్న ఘనవ్యర్థాలు

త్యాగధనులు రేనాటి సూర్యచంద్రులు

నంద్యాల(వ్యవసాయం): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, రేనాటి సూర్యచంద్రులుగా పేరు గాంచారని అంతర్జాతీయ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలుకు చెందిన లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కలియుగ దానకర్ణుడిగా పేరు గాంచిన బుడ్డా వెంగళరెడ్డికి దాతృత్వంలో ఎవరు సాటి లేరన్నారు. దాన, శౌర్య వీరులను స్మరించుకోవడం కనీస బాధ్యత అన్నారు. అనంతరం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్న కోవెలకుంట్ల కవిత్రి విజయదుర్గను సత్కరించారు. అలాగే భారత తపాలా శాఖ రూపొందించిన బుడ్డా వెంగళరెడ్డి ప్రత్యేక తపాలా కవర్లు విడుదల చేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, కర్ణాటి రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులపతి, రఫీ, అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, శేషఫణి పాల్గొన్నారు.



రేనాటి చంద్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

నంద్యాల(సిటీ): 2023–24 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం జరగనుందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు. పలు అభివృద్ధి పనులపై, ఆదాయం, వ్యయాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

3న ఉరుసు

శిరివెళ్ల: మార్చి 3వ తేదీన స్థానిక శ్రీ హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు గవర్నమెంట్ ఖాజీ సయ్యద్ అన్వీద్‌బాషా సోమవారం తెలిపారు. ఉరుసులో భాగంగా 2న గంధం, 4న జార్తలు జరుగుతాయన్నారు. ఉరుసు రోజున మహారాష్ట్ర, కర్ణాటక వారితో ఖవ్వాలీ పోటీలు, అన్నదాన కార్యక్రమాలుంటాయని చెప్పారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

నంద్యాల(అర్బన్): మండలంలోని ప్రతి ఆర్‌బీకే పరిధిలో క్వింటా జొన్న రూ.2,970 మద్దతు ధరతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారిణి స్వప్నికారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పొన్నాపురం ఆర్‌బీకే పరిధిలోని మూలసాగరం ప్రాంతంలో 405 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. ఏఓ మాట్లాడుతూ ఈ–పంటలో నమోదు చేసుకున్న రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే రైతుల కల్లాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తామని చెప్పారు.

గ్రామం పేరు మార్చండి

నంద్యాల(అర్బన్): అవుకు మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామం పేరును మునయప్ప నాయక్ తండాగా పేరు మార్చాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు రెండుందల గిరిజన కుటుంబాలు నివసిస్తున్న కొండమనాయుని పల్లె పేరును తండా వాసుల అభివృద్ధి కోసం కృషి చేసిన మునయప్ప నాయక్ తండాగా మార్చాలని గత కొన్నేళ్లుగా అధికారులను కోరుతున్నామని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటైన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని, నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సమతాసైనిక్‌దళ్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో రిలే దీక్ష చేపట్టారు. సైనిక్‌దళ్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ బొమ్మలసత్రం వద్ద ఏర్పాటైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఇటీవల ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. నాయకులు మల్లికార్జున, అబ్రహాం, రాముడు, సురేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఉయ్యాలవాడ : ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని సోమవారం బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారి నాసారి వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండవ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ కర్నూలు రీజినల్ ల్యాబ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హొళగుంద వైద్యశాలలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేలా వైద్య సిబ్బంది సహకారంతో గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిస్తామనిరు. వైద్యాధికారి రమేష్ చంద్రబాలాజీ పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లెలో సోమవారం తెల్లవారు జామున సంభవించిన అగ్ని ప్రమాదంలో సుభాన్ బాషాకు చెందిన గుడిసె కాలి బూడిదైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అందరూ నిద్రిస్తుండగా తెల్లవారుజామున విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి గుడిసె దగ్ధమైందన్నారు. మాదంలో దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. కట్టుబట్టలతో మిగిలామని ఆదుకోవాలని విలపించారు. విషయం తెలుసుకున్న వీఆర్వో మల్లేశ్వరప్ప కాలిన గుడిసెను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు.

విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయాలి

నంద్యాల(సిటీ): విద్యార్థులు నూతన పరిశోధనల వైపు అడుగులు వేయాలని గురురాజా విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పీ దస్తగిరి రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో ఇంటర్ స్కూల్ సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఈఓ మహమ్మద్ బేగ్, డాక్టర్ రామకృష్ణా రెడ్డి హాజరయ్యారు. విద్యా సంస్థల డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించాలి

నంద్యాల(అర్బన్): కష్టపడి సంపాదించుకున్న విజ్ఞానాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని, తోటి విద్యార్థులను వేధించడం సరికాదని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమీమ్ బేగం, జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ తెలిపారు. స్థానిక అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్మహత్యకు పాల్పడిన వైద్య విద్యార్థిని ప్రీతి, పాణ్యం మండలం ఆలమూరుకు చెందిన ప్రసన్న మృతికి నివాళులర్పించారు. నూర్జహాన్, బేబి, శివ, వినోద్, రవి, మహేష్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

దొర్నిపాడు: ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేసిన ముగ్గిరిపై స్థానిక పోలీసులు సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాల మేరకు..మండల కేంద్రానికి చెందిచ సుమంత్ నుంచి సురేంద్రారెడ్డి, సాయికృష్ణ, రాజా రూ.15 లక్షల వరకు వసూలు చేశారు. అయితే ఉద్యోగం ఇప్పించక పోగా.. పాటు డబ్బులు అడిగితే ముఖం చాటేస్తుండటంతో సుమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పాండురంగస్వామికి అభిషేకాలు



పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పాండురంగాపురం గ్రామంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి సోమవారం పాల్గున శుద్ధ అష్టమిని పురస్కరించుకొని ఉదయం ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, అగ్నిప్రతిష్టాపనలు చేశారు. శ్రీకామేశ్వరీ సమేత కామేశ్వర స్వామికి పూర్వక రుద్రాభిషేకాలు, శ్రీసు బ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, దీక్షా హోమాలు, అర్చన హారతి, ఫలప్రదానములు, ప్రదోష పూజలు, పుష్పార్చన, బిల్వార్చన, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు.



తాను కుట్టిన డిజైన్ జాకెట్‌ను చూపుతున్న ఈమె పేరు స్వర్ణలత. ఈమె డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో చిన్న చిన్న పనులతో పాటు టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పదేళ్ల నుంచి డిజైన్ జాకెట్లు, డ్రెస్‌లు కుట్టుకుంటూ నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తుంది. డిజైన్‌ను బట్టి ధర నిర్ణయిస్తామంటోంది.



ఈ టైలర్ పేరు వీర మల్లేశ్వరుడు. ఈయన దొర్నిపాడులో 20 ఏళ్ల నుంచి దర్జీ వృత్తితోనే ఉపాధి పొందుతున్నాడు. విద్యార్థుల స్కూల్ డ్రెస్, షర్టులు, ప్యాంట్లు కుట్టిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నాడు.

దర్జాగా రాణింపు

- రెడీమేడ్ యుగంలోనూ ఉనికి చాటుతున్న దర్జీలు
- ఎంతో మందికి జీవనాధారంగా టైలరింగ్
- పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు
- నేడు టైలర్స్ డే



రామచంద్రాపురంలో ఉమ్మడిగా టైలరింగ్ చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: రెడీమేడ్ ట్రెండ్‌ను తట్టుకుని.. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ.. పోటీ ప్రపంచంలో ముందుకు సాగుతున్నారు.. ఏళ్ల తరబడి అదే వృత్తిలో స్థిరపడి తమ కుటుంబాలను పోషించుకుంటూ తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారు టైలర్లు. ఎంతో మంది నిరుద్యోగులు, గృహిణులు..తాము స్వయం శక్తితో జీవించగలం అనే నమ్మకం కల్పిస్తోంది. నేడు అంతర్జాతీయ టైలర్ల దినోత్సం సందర్భంగా కథనం.

టైలర్స్ డే ఇలా..

దుస్తులు కుట్టుకునేందుకు తన భార్య పడుతున్న అవస్థలను జర్మన్‌కి చెందిన విలియం హోవే గమనించాడు. 1846లో 11 నెలల పాటు శ్రమించి కుట్టుమిషన్‌ను కనిపెట్టారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా కుట్టుమిషన్లు వినియోగంలోకి వచ్చాయి. ఫిబ్రవరి 28న కుట్టుమిషన్ రూపకర్త జన్మించడంతో టైలర్స్ డేగా జరుపుకుంటున్నారు.

పురుషులతో సమానంగా..

ఎక్కువ ఉపాధి అవకాశాలున్న రంగం టైలరింగ్. గ్రామాలు, మధ్య తరగతి పట్టణాల్లో అధికశాతం మంది టైలరింగ్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా శిక్షణ తీసుకుని సొంతింట్లోనే ఉంటూ ఉపాధి పొందుతున్నారు. గతంలో పురుషులే ఈ రంగాన్ని ఏలేవారు. ప్రస్తుతం వారితో సమానంగా మహిళలు దూసుకుపోతున్నారు.

కుటుంబ వృద్ధికి చేయూత..

గ్రామాల్లో మహిళలు,యువతులు టైలర్ వృత్తిని నమ్ముకుంటున్నారు. రోజు రోజుకు మారుతున్న డిజైన్లకు అనుగుణంగా వినియోగదారులను మెప్పించేలా జాకెట్లు కుట్టే వారికి అధికంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఒక జాకెట్ కుట్టడానికి డిజైన్‌ను బట్టి పట్టణాల్లో రూ.400 నుంచి రూ.6వేల వరకు తీసుకుంటున్నారు. సాధారణ జాకెట్టుకు రూ.300లకు పైగా చెల్లించాల్సి వస్తుంది. తమ ఆదాయంతో కుటుంబ వృద్ధికి అండగా నిలుస్తున్నారు.

రెడీమెడ్ ప్రభావాన్ని తట్టుకుంటూ.....

ప్రస్తుతం రెడీమెడ్ దుస్తుల ప్రభావం టైలర్స్‌పై అధికంగా చూపుతుంది. ప్రస్తుతం ఒక చొక్కా కుట్టేందుకు టైలర్ రూ.300 వరకు తీసుకుంటున్నాడు. అదే రెడీమెడ్‌లో రూ.200 కూడా షర్టు దొరుకుంది. అలాగే ప్యాంట్ కుట్టడానికిరూ.700వరకు తీసుకుంటున్నారు.